# మళ్ళీ అమరావతి కథలు

## సత్యం శంకరమంచి

### ఉక్క :

గాలి స్తంభించిపోయింది. ఒళ్ళు చెమటలు కక్కుతోంది. ఆకులాడ్డం లేదు. గాలి కోసం పెరపెర, తపన, నెత్తురుడికి పోతోంది. పశువులూ, పక్షులూ కూడా విలవిల్లాడుతున్నాయి.

అల్లాంటి సమయాన ఏ కొమ్మ వూగిందో, ఏ రెమ్మ కదిలిందో కూసింత గాలి! అమ్మయ్య! మళ్ళీ వచ్చి పలకరించింది గాలి! హాయ్! అమ్మతల్లిలా వచ్చి ఆప్యాయంగా కౌగలించుకొంది గాలి. ముఖాల్లో చిరునవ్వులు ప్రాణాలు తేరుకున్నట్టు, గుండె తేలికయినట్టు సుఖం.

బిలబిలా గాలి! జలజలా గాలి!

అలలు అలలుగా గాలి!

లోకమంతా మేల్కొన్నట్టు కటిక చీకట్లో గప్పున వెలుగొచ్చినట్టు బయ్ బయ్‌మని గాలి! రయ్ రయ్‌మని గాలి!

ఎన్ని వూసులు మోసుకొచ్చిందో గాలి!

కృష్ణ ఒడ్డున నుంచుంటే ఒంటినిండా ఏటిగాలి. చెక్కిళ్ళు నిమురుతోంది. ముఖం తడుముతోంది. జుట్టులోకి వేళ్ళు పోనిచ్చి కుదుపుతోంది. కళ్ళలో కళ్ళుపెట్టి పలకరిస్తోంది. ఒళ్ళంతా నిమిరి కౌగలించుకుంటోంది. అమ్మ తల్లిలా, అప్ప చెల్లిలా ఆపాద మస్తకం తాకి ఆలింగనం చేసుకుంటోంది. అణువణువూ తాకి, రక్తమంతా నిండి కొత్త ప్రాణం పోస్తోంది. కృష్ణంతా గాలి.

ఆకాశమంతా గాలి.

అల్లి అమరేశ్వర శిఖరం చుట్టూ గాలి. ధ్వజస్తంభం చుట్టూతా గాలి. గాలి ధ్వజస్తంభం చిరుగంటలు వూపుతోంది. ఆ గంటల మోతకి అనువుగా రెండు రామచిలకలు ముక్కులు పొడుచుకుంటున్నాయి. గాలి గోపురం శిఖరాల గాలి పారాడుతోంది. పక్కనున్న వేపచెట్ల మీద గాలి గంతులేస్తోంది. సగం కట్టి ఆపేసిన రథశాలని దిగాలుగా పలకరిస్తోంది. చిన్న రథం మీద చెక్కిన చిలకల ముక్కులు ఎవరో విరగ్గొడితే వాటిని జాలిగా బుజ్జగిస్తోంది.

అల్లా అంచెలంచెలుగా వచ్చిన కృష్ణగాలిని వూరి గాలి కలుసుకుంది.

ఎల్లమ్మ గుడిసె మించి వచ్చిన గాలి. ముసలి వగ్గైన ఎల్లమ్మ వేడి నిట్టూర్పు తనలో నింపుకున్న గాలి. 'కట్టుకున్నవాడు ఎన్నడో వెళ్ళిపోగా కన్నవాళ్ళిద్దరు మహమ్మారికి బలైపోగా, ఎందుకింకా బతికున్నాను తండ్రీ! ఏమీ సాధించ నీ ప్రాణి' అని తనలో తను గొణుక్కుంటూ ఆకాశం వంక చూపులు నిలిపి బేలగా చూస్తున్న ఎల్లమ్మని ఓదార్చి వచ్చిందా గాలి.




గుప్పుగుప్పున చుట్ట పొగ వదుల్తూ వీధరుగుమీద కూర్చున్న మోతుబరి సుబ్బయ్య చుట్టూ గుర్రుగా తిరిగింది గాలి. ఐదెకరాల పొలాన్ని యాభై ఎకరాలు చేసి వడ్డీల మీద వడ్డీలు కట్టి పుస్తెలు తాకట్టుపెట్టించి పదిళ్ళలో దీపాలార్పి, పదిమంది పొట్టగొట్టి, తను తినలేక, తిన్నది జీర్ణంకాక ఇంకా నెత్తురు కళ్ళతో, తీరని దాహంతో చూస్తున్న సుబ్బయ్య గీచిన అగ్గిపుల్ల ఆరిపోయే దాకా ఫెడేల్మని వీచి రయ్యిన ముందుకు పోయింది గాలి.

బక్కచిక్కిన ఉప్పర పోలాయి వేడి వేడి గంజి ఆర్చుకు తాగుతుంటే త్వరత్వరగా చల్లార్చింది గాలి. పక్కన గుంటలో పొర్లాడే పందులు 'గూ ... గూ ...' అని కుమ్ముకుంటుంటే మురుగు వాసన ముందుకు తెచ్చింది గాలి.. ఆ మురుగు వాసనతోటే బంతిపూల వాసనొస్తే పక్కకి చూసిన పోలాయికి సుబ్బికళ్ళు చూపింది గాలి. పోలాయి అటూ ఇటూ చూసి సుబ్బి దగ్గరకెళ్ళి, నల్లటి గుండ్రటి సుబ్బి ముఖాన్ని ఒక చేత్తో ముందుకి లాక్కుని నుదుట నున్న చాదు చుక్క ముద్దెట్టుకుని మిగిలిన ఎంగిలి గంజి నోటి కందివ్వగా, సుబ్బి అమృతంలా తాగి గలగల నవ్వగా ఆ నవ్వులు మోసుకుంటూ ఈల వేసుకుంటూ వెళ్ళిపోయింది గాలి.

దీపాల దిన్నె మీద గాలి బారలు బారలుగా ఈత కొడ్తోంది. బుద్ధ దేవుని పాదారవిందాల్ని మళ్ళీ మళ్ళీ ముట్టుకు పులకిస్తోంది. చరిత్రంతా తిరిగి తిరిగి చెప్పుకుంటూ ఆనందంతో తుళ్ళి తుళ్ళిపడుతోంది. వేల దీపాలు వెలుగుతుంటే జ్యోతులతోపాటు తనూ 'అటూ ఇటూ' పాట పాడుతున్నట్టు వూగింది.

ఇంతలో పైరగాలి పరుగెత్తుకొచ్చింది. పచ్చటి గాలి, కంకుల గాలి, కండెల గాలి, కాయల గాలి, పువ్వుల గాలి, పూతల గాలి నేలవాసన పూసుకుని వూరంతా పరుచుకుంది. ఆకాశమంతా నిండిపోయింది.

ఉన్నట్టుండి గాలి ఆగిపోయింది.

స్తంభన.

ఆకు కదలడం లేదు. రెమ్మ వూగడం లేదు.

ఎల్లమ్మ గాజుకళ్ళు ఆకాశంలోకి చూస్తున్నాయి. సుబ్బయ్య చుట్ట ఆరిపోయింది.

పోలాయి గంజి ముంత ఖాళీ అయింది. సుబ్బి తల్లో బంతిపూలు వాడిపోయాయి. దీపాల దిన్నె మీద దీపాలు లేవు.

ఎన్నడు మళ్ళీ గాలివీచునో! ఎన్నడు ఈ గడ్డ తిరిగి ప్రాణం పోసుకొనునో!

*

## ముత్యాలవాన